


నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి -ఐ.పోలవరం

వాహనదారులు రహదారి నిబంధనలు పాటింకపోతే చర్యలు తప్పవని ఎస్ఐ సిహెచ్.రాజేష్ అన్నారు. ఐ.పోలవరం మండలంలోని పాతఇంజరం పోలీస్ స్టేషన్ సమీపంలో ఎదుర్లంక వారధి వద్ద ఆదివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో పలు వాహనదారులకు ఆన్ లైన్ ద్వారా కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించ లేక పోయినా, రికార్డులు సక్రమంగా లేక పోయినా వారిపై ఆన్ లైన్‌లో కేసులు నమోదు చేస్తున్నామని అన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే వారి పై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఎస్ ఐ సి హెచ్ రాజేష్, ఎఎస్ఐ శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వైపరీత్యాలతో తల్లడిల్లుతున్న కోనసీమ

- పలుచోట్ల నిరుపయోగంగా తుపాను షెల్టర్లు
- యంత్రాంగానికి ముందస్తు అవగాహన అవసరం
- మేలుకోకుంటే పెనుముప్పు తప్పదు

ప్రజాశక్తి-మామిడికుదురు

ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడల్లా ఎక్కువగా నష్టపోయేది డాక్టర్ బిఆర్. అంబేద్కర్ కోనసమీ జిల్లా..బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడితే కోనసీమ చిగురుటాకులా వణికిపోతుంది. జనావళిపై విరుచుకుపడే తుపాను వంటి ఉపద్రవాలు అంటే ఈ ప్రాంతవాసులుభయంతో వణికిపోవడం సహజమే. సముద్ర తీర, నదీ తీరప్రాంతాల వాసులు ఎప్పుడు ఏ విపత్తు ముంచుకొస్తుందోనని బిక్కుబిక్కు మంటూ జీవనం సాగిస్తారు. ఏటా నవంబర్, డిసెంబర్ నెలల్లో తుపాన్లు రావడం.. సముద్రతీర ప్రాంతప్రజలు ఆందోళకుగురికావడం.. అధికారుల తీరుపై ఆవేదన వ్యక్తంచేయడం.. గంగమ్మ మీద భారం వేయడం పరిపాటిగా మారింది. తుపాన్లు, వరదలు వంటి ప్రకృతి విపత్తులు సంభవిస్తే మన తీర ప్రాంతాలు ఎంత భద్రమో తెలుసుకుంటే ఆందోళనకుగురి కావల్సిందే..

శిథిల స్థితిలో తుపాను రక్షిత భవనాలు..

తుపాను ప్రభావానికి ప్రధానంగా కాకినాడ జిల్లాలో 5 మండలాలు, డాక్టర్‌బిఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 7 మండలాలకు మొత్తం 161 కి.మీ సముద్ర తీర ప్రాంతం ఉంది.ఈ రెండు జిల్లాల్లో 143



ముత్యాలపాలెం శిథిలావస్థకు చేరిన తుపాను షెల్టర్



1996 తుపానుకు మామిడికుదురులోనేలకూలిన కొబ్బరి చెట్లు(ఫైల్ ఫొటో)

గ్రామాలు 149 తుపాను భవనాలు ఉన్నాయి. వీటిలో స్వల్ప మరమ్మతులతో సగంపైగా వినియోగంలోకి తీసుకురావచ్చు. 25 తుపాను షెల్టర్లు శిథిలస్థితికి చేరుకుని నిరుపయోగంగా ఉన్నాయి. అయితే 19 గ్రామాల్లో ఒక్క షెల్టరు లేకపోవడంతో విశేషం. కాకినాడ డివిజన్‌లో 51 తుఫాను షెల్టర్లు ఉండగా, 28పాడయ్యాయి. అమలాపురం డివిజన్ పరిధిలో 68 షెల్టర్లు ఉండగా28 పూర్తిగా దెబ్బతిన్నాయి. పెద్దాపురం డివిజన్‌లో 29 తుపానుషెల్టర్లు ఉండగా 18 షెల్టర్లు శిథిలావస్థకు చేరాయి.

పట్టని పునరావాస కేంద్రాల దుస్థితి

తుపాను కాట్రేనుకోన మండలంలో 27 కి.మీ సముద్ర తీరప్రాంతంలో 11గ్రామలుండగా బలుసుతిప్ప, చిర్రయానాం, గుచ్చుకాయాల పౌర గ్రామాల్లో మాత్రమే ఉన్న షెల్టర్లు శిథిలమయ్యాయి. ఐ.పోలవరం మండల పరిధిలో 20 కి.మీ తీరప్రాంతం విస్తరించి ఉంది. భైరవపాలెం, గోగుల్లంక, జి.వేమవరం, మూలపొలంల్లో ఉన్న షెల్టర్లకు వార్షిక మరమ్మతులు లేక నిరుపయోగంగా ఉన్నాయి.

ఉప్పలగుప్తం మండలంలో 16కి.మీ తీరప్రాంతంలో 11 షెల్టర్లు ఉన్నాయి. అల్లవరం మండలంలో కొమరగిరిపట్నం, ఓడల రేవు, ఎస్.పల్లిపాలెం తీరగ్రామాల్లో ఆరు షెల్టర్లు ఉన్నాయి.

మామిడికుదురు మండలంలో నాలుగు కి.మీ తీరప్రాంతంలో కరవాక, ముత్యాలపాలెంలో షెల్టర్లు ఉన్నాయి. ముత్యాలపాలెం షెల్టరు పూర్తిగా శిథిలమైన ఏ క్షణమైనా కూలిపోయే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

మలికిపురం మండలంలో 18 కి.మీ తీరప్రాంతంలో చింతలమోరి, శంకరగుప్తం, పడమటిపాలెం , కేశనపల్లి, తూర్పుపాలెం, గొల్లపాలెం గ్రామాలు తీరానికి చేరువగా ఉన్నాయి. అన్ని గ్రామాల్లో షెల్టర్లు ఉన్నప్పటికీ, కేశనపల్లి మినహా మిగిలినవన్నీ శిథిలావస్థలో ఉన్నాయి. సఖినేటిపల్లి మండలంలో 15 కి.మీ తీరప్రాంతంలో సఖినేటిపల్లి, కేశవదాసుపాలెం, అంతర్వేది, అంతర్వేది దేవస్థానం, పల్లిపాలెంల్లో 8 షెల్టర్లు ఉండగా సఖినేటిపల్లి లంక, కేశవదాసుపాలెం, అంతర్వేదిల్లో కొత్తగా నిర్మించిన షెల్టర్లు వినియోగిస్తున్నారు.

వైపరీత్యాలను నిరోధించగలిగే మార్గాలపై..

సముద్ర కల్లోలాన్ని నిరోధించడం ఇప్పటికీ మానవసాధ్యం కాకపోయినా విపత్తు నుంచి సాధ్యమైన వరకు తప్పించుకో గల మార్గాలపై దృష్టిసారించాలి. యంత్రాంగానికి ముందస్తుగా అవగాహన కల్పించాలి. తుపాను సమయంలో బాధితులను సురక్షిత గ్రామాలకు తరలించడం కష్టసాధ్యమైన పని. అందుచేత తీరానికి అతిచేరువుగా ఉండే గ్రామాల్లో షెల్టర్లకు అధిక ప్రాధాన్యత నివ్వాలి.కొద్దిపాటి మరమ్మతులున్న షెల్లర్లకు మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురావాలి. తీరానికి రక్షణగా ఉండే సరుగుడు తోటలు, మడ అడవులను సంరక్షించేందుకు నిఘాఏర్పాటుచేయాలి.



రాళ్లు పైకి లేచి అధ్వానంగా ఉన్న ఏడిద సావరం రోడ్డు

ఎనిమిదేళ్లుగా గతుకుల రహదారే...

- అధ్వానంగా ఏడిద సావరం రోడ్డు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి -మండపేట

మండలంలో ఏడిద సావరం నుంచి మండపేట పట్టణానికి చేరుకునేందుకు ఎంతో సౌకర్యవంతంగా ఉండే ఏడిద సావరం పుంత రోడ్డు గత ఎనిమిది సంవత్సరాలుగా అధ్వాన్నంగా ఉంది. దీంతో ఆగ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సావరం గ్రామ ప్రజలు నేరుగా మండపేట, తాపేశ్వరం తదితర ప్రాంతాలకు చేరుకునేందుకు ఈ రోడ్డును వినియోగిస్తారు. ఈ పుంత రోడ్డు మండపేట బైపాస్ రోడ్డు మీదుగా సత్య శ్రీ రోడ్డుకు కలుస్తుంది. అక్కడి నుంచి రాజారత్న, కలువపువ్వు సెంటర్ తదితర ప్రాంతాలకు వెళ్ళవచ్చు. సుమారు నాలుగు కి.మీ ఉన్న ఈ రోడ్డంతా రాళ్ల లేచిపోవడంతో ప్రజలు, రైతులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు బాగా పాడైపోవడంతో ధాన్యం తరలింపులోను ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఈ రోడ్డు అభివృద్ధి చేయడంలో భాగంగా రోడ్డును కొంతమేర తవ్వేశారు. అయితే ఎన్నికల అనంతరం తిరిగి పనులు ప్రారంభం కాలేదు. దీంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. పాల కులు, అధికారులు స్పందించి రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారిని అభివృద్ధి చేయాలి



20 సంవత్సరాలుగా ఈ రోడ్డు పాడైపోయి అధ్వానంగా మారడంతో అవస్థలు పడుతున్నాము. మా గ్రామం నుంచి ఏడిద వెళ్లకుండా మండపేట, తాపేశ్వరం గ్రామాలకు వ్యవసాయ పనుల కోసం వెళ్లే వారికి ఈ రోడ్డు ఎంతో అనువుగా ఉంటుంది. ఇప్పటికైనా అధికారులు రోడ్డును అభివద్ధి చేయాలి.

-కుడుపూడి వెంకటేశ్వర్లు, రైతు, ఏడిద సావరం




దాతలకు చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

అన్నదాన ట్రస్ట్‌కు రూ.3 లక్షల విరాళం

ప్రజాశక్తి - మామిడికుదురు

అప్పనపల్లి బాల బాలాజీ స్వామి శాశ్వత అన్నదాన నిధికి సికింద్రాబాద్ వాసులు పసుపులేటి శరత్ చంద్ర బాబు జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు సుజల వెంకట శశిధర్, వెంకట సత్య లక్ష్మి లు రూ.3,01,116 చెక్కు విరాళం గా అందజేసినట్లు ఇఒ కార్యనిర్వహణాధికారి ఆదివారం తెలిపారు. దాత కుటుంబానికి స్వామివారి చిత్రపటం ప్రసాదములు అందజేశారు. ఆలయానికి ఆదివారం లడ్డూల విక్రయం, దర్శనం టిక్కెట్లు అమ్మకాల రూపంలో రూ.2,40350, నిత్యాన్నదాన ట్రస్ట్‌కు రూ.1,01,171 మొత్తం రూ.3,41,521 ఆదాయం వచ్చిందని ఇఒ తెలిపారు. 5864 మంది స్వామివారిని దర్శించుకోగా 4397 మందికి భోజన వసతులు కల్పించామన్నారు. ధర్మకర్తల మండలి ఛైర్మన్ చిట్టూరి రామకృష్ణ,సభ్యులు యాత్రికులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కార్టూ'నిజం'



జగనన్న ఇళ్ల నిర్మాణాలతో 31 లక్షల కుటుంబాలకు లబ్ధి

ప్రజాశక్తి - మామిడికుదురు

రాష్ట్ర చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా 31 లక్షల పేదల కుటుంబాలకు ఇళ్ల నిర్మాణాల ద్వారా రూ.3-4 లక్షల కోట్ల సంపద లబ్ధిదారులకు క్రియేట్ అవుతుందని పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. మామిడికుదురు పిఎసిఎస్ ఛైర్ పర్సన్ కటకంశెట్టి ఆదిత్య కుమార్ స్వగృహంలో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిజమైన అభివద్ధి జరుగుతుంటే ఏమీ జరగడం లేదంటూ చెప్పేందుకు ప్రతిపక్షాలు ప్రయత్నం చేయడమ వారి దిగజారుడు ఆలోచనలకు నిదర్శన మన్నారు. మూడు వందల మంది కాంట్రాక్టర్లు, 17 వేల జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాలు చేస్తున్నారని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు, అరాచకాలను సిఎం సరి చేసుకుంటూ మంచి వాతావరణం కల్పిస్తున్నారన్నారు. ప్రతిపక్షాల నాటకాలకు అడ్డుకట్ట వేయాలంటే సామాజిక సహ కలిగినవారు నిలదీయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమంలో అయినవిల్లి వైస్ ఎంపిపి బయ్యా చినబాబు, ఎంపిటిసి సమాఖ్య అధ్యక్షులు యడ్ల కిరణ్ బాబు, నెల్లి దుర్గా ప్రసాద్, కుసుమ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పి.గన్నవరం ఎంఎల్ఎ చిట్టిబాబు



దాసరికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న టిడిపి నాయకులు

ఘనంగా దాసరి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - అయినవిల్లి

టిడిపి అమలాపురం పార్లమెంటు మీడియా ప్రధాన కార్యదర్శి దాసరి వేణుగోపాలరావు పుట్టినరోజు వేడుకలు తాళ్లరేవు లో ఆదివారం పి.గన్నవరం నియోజకవర్గ టిడిపి శ్రేణులు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర బిసి సాధికార సమితి కన్వీనర్ పెండ్ర రమేష్, ఎన్‌టిఆర్ యువసేన అధ్యక్షుడు వక్కలంక బుల్లియ్యల ఆధ్వర్యంలో కేకు కట్ చేశారు. అనంతరం వేణుగోపాలరావును పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.కార్యక్రమంలో చిక్కం బాలరాజు, ఉండుర్తిపరంజ్యోతి, కాగిత వీర వెంకట సత్యనారాయణ కార్యకర్తలు పాల్గొన్నారు.



పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

మార్షల్ ఆర్ట్స్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-రావులపాలెం

రావులపాలెంలో రెడ్డీస్ కల్యాణమండపం నందు మార్షల్ ఆర్ట్స్ రాష్ట్రస్థాయి పోటీలు ఆదివారం ప్రారంభించారు. ఈ పోటీలకు 20 జిల్లాల నుంచి 400 మంది విద్యార్థులు పాల్గొన్నారని కోనసీమ ఎస్క్యువై జిల్లా సెక్రెటరీ సత్య శ్రీ తెలిపారు. కార్యక్రమంలో ఎపి సెక్రెటరీ షేక్ ఇబ్రహీం, ఎంపీపీ లక్ష్మి నాగ దేవి వీర్రెడ్డి, విక్టరీ సంస్థల ఎండి కర్రి నాగ సత్యనారాయణ రెడ్డి(సత్య), కోనసీమ జిల్లా ప్రెసిడెంట్ కర్రి శ్రీ రామ చంద్రారెడ్డి, సిఆర్‌సి స్పోర్ట్స్ డైరెక్టర్ నల్లమిల్లి వీర రాఘవ రెడ్డి, సాక ప్రసన్న కుమార్, పితాని రాంబాబు,జిల్లాల మాస్టర్స్ తదితరులు పాల్గొన్నారు.



పైపు లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఎ

శివారు ప్రాంతాలకు స్వచ్ఛమైన తాగునీరు

ప్రజాశక్తి - అంబాజీపేట

జలజీవన్ మిషన్ ద్వారా శివారు ప్రాంతాల గ్రామాలకు ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని పి.గన్నవరం ఎంఎల్ఎ కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. ఆదివారం వాకలగరువులో రూ.46.25 లక్షల జలజీవన్ నిధులతో, తొండవరంలో రూ.46.80 లక్షల నిధులతో చేపట్టే పైపు లైన్ నిర్మాణ పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన చేశారు. వేసవిలో తాగునీటి ఎద్దడి లేకుండా కార్యాచరణ రూపొందించామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు మద్దింశెట్టి దొరబాబు, పేరాబత్తుల రామలింగరాజు, ఎంపిపి దొమ్మేటి వెంకటేశ్వరరావు, స్థానిక ఎంపిటిసి సభ్యుడు వాకపల్లి కాశీవిశ్వనాథ్, పేరి శ్రీను, వాసంశెట్టి వరలక్ష్మి చినబాబు, నాగవరపు నాగరాజు, మద్దింశెట్టి మల్లిబాబు, కేతారాజు, వాకపల్లి శ్రీనివాసరావు, కుడిపూడి సత్తిబాబు, ఎన్.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

'మోడరన్ కళాశాలను సందర్శించిన ఆర్ఐఒ

ప్రజాశక్తి -రామచంద్రపురం



ఆర్ఐఒ నూకరాజును సత్కరిస్తున్న దృశ్యం

రామచంద్రపురం పట్టణంలో గల మోడరన్ కళా శాలను ఇంటర్మీడియేట్ అద నపు సెక్షన్స్ ఇన్‌స్పెక్షన్ నిమి త్తం ఆదివారం ఆర్ఐఒ జిజి కె.నూకరాజు పరిశీలించారు. మోడరన్ జూనియర్ కాలేజీని లో అన్ని సౌకర్యాలు పర్యవేక్షించారు. అనంతరం కళాశాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కళాశాల నిర్వహణ, ఏర్పాట్లు పట్ల ఆయన సంతప్తి వ్యక్తం చేశారు. అనంతరం మోడరన్ అధినేత జివి.రావు, ప్రిన్సిపల్ రాజేష్ తదితరులు ఆయనను సత్కరించారు.

ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షునిగా గణపతి

ప్రజాశక్తి-రామచంద్రపురం

ఆర్యవైశ్య సంఘం నూతన గౌరవాధ్యక్షునిగా పట్నాల గణపతి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం రామచంద్రపురం పట్టణంలోని లక్ష్మీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ఏర్పాటు చేశారు. స్థానిక తిలక్ మెమోరియల్ టౌన్ హాల్ నందు ఈ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కార్తిక వనభోజనాలు ఏర్పాటు చేశారు. అనంతరం నూతన కార్యవర్గం ఏర్పాటు చేశారు. గౌరవ అధ్యక్షునిగా పట్నాల గణపతి, అధ్యక్షునిగా పట్నాల సూర్యప్రకాశరావు, ప్రధాన కార్యదర్శిగా పివి.సత్యనారాయణ, కోశాధికారిగా పట్నాల నగేష్, సంయుక్త కార్యదర్శిగా పట్నాల వీర సత్యనారాయణమూర్తి, పట్నాల సత్తిబాబు, జాయింట్ ట్రెజరర్‌గా ఖండవిల్లి వెంకటేష్, ఉపాధ్యక్షులుగా ఖండవిల్లి కనకదుర్గా ప్రసాద్, ఖండవిల్లి మారుతి ప్రసాద్ ఎన్నికయ్యారు. అదేవిధంగా ఒక్కొక్క గ్రామం నుంచి ఒక్కొక్కరు సంఘ సభ్యులుగా నియమితులయ్యారు. మాజీ సొసైటీ అధ్యక్షులుగాను డిసిఎంఎస్ డైరెక్టర్ గానూ పనిచేసిన పట్నాల గణపతిని ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఘనంగా సన్మానించారు.



పట్నాల గణపతిని సన్మానిస్తున్న సంఘ సభ్యులు

'సిఎన్‌జి'లోకి టయోటా కిర్లోస్కర్ మోటార్ ప్రవేశం


ప్రజాశక్తి -అమలాపురం

కస్టమర్-ఫస్ట్ ఫిలాసఫీకి అనుగుణంగా, టయోటా కిర్లోస్కర్ మోటార్ (టికెఎం) సిఎన్‌జి సెగ్మెంట్లోకి తన ప్రవేశాన్ని ప్రకటించింది. తద్వారా టయోటా గ్లాంజాస్, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ మోడల్ లైనప్ రెండింటిలోనూ వినియోగదారులు ఎంచుకోవడానికి మరిన్ని మోడళ్లను అందిస్తుంది. ఈ ఏడాది ప్రారంభంలో ఆవిష్కరించిన టయోటా గ్లాంజా ఇప్పుడు మాన్యువల్ ట్రాన్స్ మిషన్ పవర్ ట్రెయిన్ తో పాటు ఎస్అండ్‌జి గ్రేడ్లలో సిఎన్‌జి వేరియంటుతో లభిస్తుంది. ఈ సెగ్మెంట్‌లో మొట్టమొదటిసారిగా, అర్బన్ క్రూయిజర్ హైరైడర్ టూ ఇప్పుడు ఎస్, జి గ్రేడ్లు రెండింటిలోనూ ఫ్యాక్టరీలోనే ఫిట్ చేసిన సిఎన్‌జి కిట్‌తో లభ్యం అవుతుంది. రెండు గ్రేడ్లలో మాన్యువల్ ట్రాన్స్ మిషన్ (ఎంట) పవర్ ట్రెయిన్ ఉన్న సిఎన్‌జి వేరియంట్ సెల్ఫ్-ఛార్జింగ్ స్ట్రాంగ్ హైబ్రిడ్ ఎలక్ట్రిక్ తో పాటు నియో డ్రైవ్ వేరియంట్లకు అదనంగా ఉంటుంది. ఇవి ఇప్పటికే మార్కెట్లో అందుబాటులో ఉన్నాయి. వినియోగదారుల నుంచి చాలా ప్రోత్సాహకరమైన ప్రతిస్పందనను అందుకున్నాయని టికెఎం సేల్స్, స్ట్రాటజిక్ మార్కెటింగ్ అసోసియేట్ వైస్ ప్రెసిడెంట్ అతుల్ సూద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మంత్రి విశ్వరూప్‌నకు పలువురి పరామర్శ



మంత్రిని కలిసిన పేరూరు గ్రామ సర్పంచ్ తదితరులు



విశ్వరూప్‌ను కలిసిన మంత్రి వేణు, జిల్లా ఎస్‌పి సుధీర్‌కుమార్‌రెడ్డి

ప్రజాశక్తి యంత్రాంగం


గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న అనంతరం కోలుకున్న మంత్రి విశ్వరూప్ ఇటీవల అమలాపురం వచ్చారు. ఆయనను ఆదివారం పలువురు కలిసి పరామర్శించారు.

అమలాపురం రూరల్ ఇటీవల గుండె శస్త్ర చికిత్స చేయించుకుని సంపూర్ణ ఆరోగ్యంతో అమలాపురం వచ్చిన మంత్రి పినిపే విశ్వరూప్ ని ఆదివారం పేరూరు గ్రామ సర్పంచ్ దాసరి అరుణ ఆధ్వర్యంలో ఆ గ్రామ వైసిపి నాయకులు కలిశారు. ఈ సందర్భంగా వారు మంత్రిని తన ఆరోగ్యం గురించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యుడు చొల్లంగి సుబ్బిరామ్ తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** మంత్రి పినిపే విశ్వరూప్ ను సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, వేర్ హౌసింగ్ మాజీ డైరెక్టర్ చీకట్ల అబ్బాయి, వంటెద్దు బాబి తదితరులు కలిశారు. **అమలాపురం**రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్‌ను ఆదివారం పలువురు నాయకులు, అధికారులు అమలాపురం క్యాంప్ కార్యాలయంలో కలిసి ఆరోగ్య యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, ప్రభుత్వ విప్ ప్రసాద్ రాజు, కిమ్స్ అధినేత చైతన్య రాజు, రాజోలు ఎంఎల్ఎ రాపాక వరప్రసాద్, జిల్లా ఎస్‌పి సుధీర్ కుమార్ రెడ్డి తదితరులు మంత్రి విశ్వరూప్‌ను కలిశారు.

ఘనంగా వన సమారాధనలు

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలో పలు చోట్ల వన సమారాధనలు ఘనంగా ఆదివారం నిర్వహించారు. బడుగువానిలంక శివారులో ఉన్న శ్రీకర్లమ్మ ఆలయం వద్ద రైతుల ఆధ్వర్యంలోను, మడికి కరణం రాము ఆధ్వర్యంలోను, చౌడేశ్వరి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలోను ఇలా పలు కమిటీలు, సంక్షేమ సంఘాల నిర్వహణలో వన సమారాధనలు జరిగాయి. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొనడంతో వారికి ప్రత్యేక భోజన ఏర్పాట్లు కమిటీ సభ్యులు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి.


స్నేహితులతో బైరవకృష్ణ

బైరవకృష్ణ ఆధ్వర్యాన వన సమారాధన

ప్రజాశక్తి-జగ్గంపేట

1972-73 ఎస్ఎస్ఎల్సి బ్యాచ్ విద్యార్థులలు ఆదివారం జగ్గంపేటలోని ప్రముఖ పారిశ్రామికవేత్త కొత్త బైరవకృష్ణ ఆధ్వర్యంలో వనసమానాధన నిర్వహించారు. జిల్లాలోని ప్రముఖ పారిశ్రామికవేత్తగా రైస్ మిల్లర్స్ అసోసియేషన్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్న బైరవకృష్ణ తనతో పాటు చదువుకున్న స్నేహితులను పిలిచి తన స్వగ్రామైన జగ్గంపేటలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ స్థాయికి చేరినా స్నేహభావాన్ని గుర్తించాలని చెప్పారు. జీవితంలో ఎన్నో కష్టాలు అనుభవించిన తాను ఈ స్థాయిలో ఉండటానికి కారణం కులమత బేధాలు, స్వార్థపూరితమైన రాజకీయాలు లేకపోవడమేనని ఆయన అన్నారు. ఈ కార్యక్రమానికి ఆయన తన స్నేహితులైన 60 మందితో కలిసి పాల్గొన్నారు.


నృత్యోత్సవంలో పాల్గొన్న చిన్నారులు

అలరించిన జాతీయ నృత్యోత్సవం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

చిన్నారులు చిట్టి పొట్టి పాదాలతో అలవేలు మంగతాయారు అంటూ చేసిన నృత్యాలు కళాకారులను అలరించాయి. ఆదివారం కాకినాడ దంటు కళాక్షేత్రంలో హరిహర ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన జాతీయ నృత్యోత్సవం-2022 కార్యక్రమంలో ఉభయ గోదావరి జిల్లాలతో పాటుగా పలు జిల్లాల నుంచి సుమారు 200 మంది విద్యార్థులు నృత్యం చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా 16 మంది గురువులను నిర్వాహకులు ఐ.అర్చనరావు, పైడారావు సన్మానించారు. ఒకరికి గురు విజ్ఞాన్, ఒకరికి నాట్య తపస్వి అవార్డులతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాట్యాచార్యులు ఒవియన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'కొండ'కు ఎంఎల్ఎ చినరాజప్ప పరామర్శ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

అనారోగ్యంతో బాధపడుతున్న హుస్సేన్‌పురానికి చెందిన చల్లా కొండను ఆదివారం పెద్దాపురం ఎంఎల్ఎ నిమ్మకాయల చినరాజప్ప పరామర్శించారు. కొండ ఆరోగ్య పరిస్థితిపై ఆయన ఆరా తీశారు. కొండ కుటుంబ సభ్యులను కలసి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు కోటా అప్పారావు, ఆటో రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో సిఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, వైసిపి పెద్దాపురం నియోజకవర్గం ఇన్‌చార్జి దవులూరి దొరబాబు పేర్కొన్నారు. ఆదివారం సామర్లకోట మండలం ఉండూరులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దొరబాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బొబ్బరాడ సత్తిబాబు, గ్రామ సర్పంచి సత్యాడి ధనలక్ష్మి, ఉప సర్పంచి కొప్పిరెడ్డి రాధాకృష్ణ, వైసిపి నాయకులు, కార్యకర్తలు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.


నేషనల్ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దశ్యం.

లోక్ అదాలత్‌లో 709 కేసుల పరిష్కారం

ప్రజాశక్తి - రామచంద్రపురం

రామచంద్రపురం లోని లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 709 కేసులు పరిష్కరించారు. రామచంద్రపురం కోర్టు ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమంలో నేషనల్ లోక్ అదాలత్‌లో 3 బెంచులు ఏర్పాటు చేశారు. మొదటి బెంచ్ నందు సీనియర్ సివిల్ జడ్జి కె.మాధవి దేవి, బెంచ్ మెంబర్ దుళ్ళ సత్యనారాయణ, 2వ బెంచ్ నందు బి.వాణిశ్రీ, బెంజ్ మెంబర్ బి.తారకేశ్వరరావు, మూడో బెంచ్ నందు ఆర్.ఆశీర్వాదం పౌలు, బెంచ్ మెంబర్ పి.సత్యనారాయణ నిర్వహించారు. మొత్తం 709 కేసులు పరిష్కరించారు. ఇందులో సివిల్ కేసులు 19, క్రిమినల్ కేసులు 678, పి ఎల్ సి 12 కేసులు పరిష్కరించారు. సెటిల్ లైన్ అమౌంట్ మొత్తం రూ.73,51,462 సొమ్ము జమకాబడినట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు.

జాగ్రత్తలతోనే వ్యాధుల నుంచి రక్షణ

ప్రజాశక్తి -మండపేట

సాధారణంగా అంటువ్యాధులు శీతాకాలంలో వ్యాపిస్తుంటాయని హోమియో వైద్యులు డాక్టర్ చల్లా రవికుమార్ అన్నారు. కొన్ని జాగ్రత్తలు తీసుకోవడంతో ఆరోగ్యాన్ని కాపాడుకోనవచ్చునన్నారు. ఈసందర్భంగా ఆయన ప్రజాశక్తి దినపత్రికతో మాట్లాడారు. ఉష్ణోగ్రతలో వచ్చే మార్పుల వల్ల, గాలిలో చాలా రకాల వైరస్‌లు సులువుగా అభివృద్ధి చెందుతాయన్నారు. ముఖ్యంగా ఫ్లూ వైరస్‌లు త్వరితగతిని వ్యాప్తి చెందుతాయన్నారు. అందుకునే జలుబు వల్ల జ్వరాలు సర్వసాధారణంగా వస్తుంటాయన్నారు. శరీరాన్ని వెచ్చగా ఉంచే ఉన్ని లేదా దళసరి దుస్తులు ధరించి శరీర ఉష్ణోగ్రతను కాపాడుకోవాలన్నారు. ఈ కాలంలో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుందని, విటమిన్-సి అధికంగా ఉండే పండ్లు, ఆకుకూరలు, కాయకూరలు తీసుకోవాలన్నారు. తేమశాతం తక్కువగా ఉండటం వల్ల చర్మం తరచు పొడిబారి పగుళ్ల ఏర్పడం వల్ల రకరకాల ఎలర్జీ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. అంతే కాకుండా తలపైన భాగంలో చుండ్రు, ఎగ్జిమ వంటి వ్యాధులు వ్యాపిస్తుంటాయన్నారు. కొబ్బరి, నువ్వులనునె, వెన్నపూస అలివ్ ఆయిల్ వంటి వాటిలో చర్మం మీద మర్దనా చేయడంతో చర్మ సౌందర్యాన్ని కాపాడు కోవడమే కాకుండా చర్మ వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చున్నారు. ఫ్లూ జ్వరం రాకుండా 'జెర్సినియం-30' అనే మందును వాడటం ద్వారా రక్షణ పొందవచ్చునన్నారు. కీళ్ల నొప్పులతో కూడిన ఫ్లూ జ్వరానికి యుఫటోరియం పర్ఫ్ 30 అనే మందు ఉపయోగపడుతుంది. ఈ మందుకు రోజుకు 3 సార్లు 6 మాత్రలు చొప్పున వరుసగా 3 రోజులు వాడటంతో ఈ వ్యాధి నుంచి ఉపశమనం పొందవచ్చును.

బాధితులకు రెడ్ క్రాస్ సాయం

ప్రజాశక్తి-తాళ్లరేవు

తాళ్లరేవు పంచాయతీ సత్తరువుపేటకు చెందిన అంగాడి మణిరత్నం తాటాకిల్లు ఇటీవల దగ్ధం కావడంతో రెడ్ క్రాస్ ఆధ్వర్యాన సాయం అందజేశారు. సంస్థ ఇచ్చిన నిత్యావసర వస్తువులను, సంస్థ ప్రతినిధులతో కలిసి జెడ్‌పిటిసి దొమ్మేటి సాగర్ బాధితులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ కోరుకొండ నారాయణ, వైస్ చైర్మన్ పిన్నమరాజు వెంకటపతిరాజు, సర్పంచ్ రెడ్డి అరుణ సుహాసిని దేవి, ఎంపిటిసి శ్రీదేవి, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

గ్రంథాలయ సెస్ బకాయిలపై దృష్టి

గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ప్రసాద్





ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లాలో ఉన్న గ్రంథాలయాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యల్లో భాగంగా సెస్ బకాయిల వసూళ్లపై దృష్టి సారించామని, పాఠకుల్లో ఆసక్తిని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని, వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను అందజేస్తున్నామని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వివిఎల్ఎన్ఎస్‌వి ప్రసాద్ తెలిపారు. అన్ని గ్రంథాలయాల్లో మరిన్ని సౌకర్యాలు కల్పించి, శిథిలావస్థకు చేరిన భవనాలను మరమ్మత్తులు చేసి అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు.

గ్రంథాలయాల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు ఏమిటి.?

జిల్లాలో 102 ప్రభుత్వ గ్రంథాలయాలున్నాయి. వీటిలో 57 లైబ్రరీలకు సొంత భవనాలుండగా, 14 అద్దె భవనాల్లోనూ, 31 ఉచితంగా ఏర్పాటు చేసిన భవనాల్లోనూ నడుస్తున్నాయి. వీటిలో ఎప్పటికప్పుడు సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రతి గ్రంథాలయంలోనూ స్టడీ ల్యాబ్ ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటున్నాం. జిల్లా కేంద్రంలోని కాకినాడలో ఏర్పాటు చేయగా తరువాత దశలో అన్ని మున్సిపల్ కేంద్రాల్లోనూ వీటిని ఏర్పాటు చేస్తాం.

సిబ్బంది కొరత ఉందా..?

జిల్లా కార్యాలయంలో మొత్తం 204 మంది సిబ్బందికి గాను 63 మంది రెగ్యులర్, 30 మంది ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్నారు. ఇంకా 104 మంది సిబ్బంది అవసరం ఉంది. సిబ్బంది కొరత వల్ల ఉన్న వారిపైనే అధికభారం పడుతోంది. ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం. త్వరలో కొంత మంది సిబ్బందిని ఔట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేసే అవకాశం ఉంది.

పుస్తకాలు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉన్నాయా..?

జిల్లాలో ఉన్న అన్ని గ్రంథాలయాలల్లో ప్రస్తుతం సుమారు 14,54,930 లక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. సుమారు 90 వేల మంది సభ్యులు ఉన్నారు. ఒక లక్ష మంది సెక్యూరిటీ డిపాజిట్ చేశారు. గేడ్ 1 గ్రంథాలయాలకు రోజుకి 200 మంది, గ్రేడ్ 2 గ్రంథాలయాలకు 150 మంది, గ్రేడ్ 3 గ్రంథాలయాలకు 100 మంది పాఠకులు హాజరవుతున్నారు. వీరిలో 25 శాతం మంది కాంపిటీటీవ్ పరీక్షల కోసం వస్తున్నారు. డిమాండ్ ఆధారంగా నిధుల లభ్యతను బట్టి పరిపాలనా ఆమోదం ద్వారా పుస్తకాలను కొనుగోలు చేస్తున్నాం. వీటి కొనుగోలుకు సంవత్సరానికి సుమారు రూ.50 లక్షలు బడ్జెట్ కేటాయింపులు జరుగుతున్నాయి.

సెస్ బకాయిలపై దృష్టి సారించారా..?

జిల్లాలో అన్ని గ్రంథాలయాల పరిధిలో దాదాపు రూ.30.51 కోట్లు సెస్ బకాయులు పెండింగ్‌లో ఉన్నాయి. రాజమహేంద్రవరం రూ.9 కోట్లు, కాకినాడలో సుమారు రూ.5 కోట్లు, ఇతర ప్రాంతాల్లో మిగిలిన సెస్ బకాయిలను వసూలు చేసేందుకు ఇటీవల జెసి ఇలాక్కియా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బకాయి వసూళ్లపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తాం.

శిథిలావస్థకు చేరిన గ్రంథాలయాల పరిస్థితి ఏమిటి..?

జిల్లాలో ఉన్న 57 సొంత భవనాలల్లో కొన్ని శిథిలావస్థకు చేరి ఉన్నాయి. వీటిలో ఎక్కువ శాతం 50 ఏళ్ల దాటినివే ఉన్నాయి. ప్రతి సంవత్సరం సెస్ వసూలు ద్వారా రూ.కోటిన్నర ఆదాయం వస్తుంది.

నూతన భవనాలు నిర్మిస్తున్నారా.?

అనపర్తి, రామచంద్రాపురం, కొమరిపాలెం, కోరంగి, అమలాపురం ప్రాంతాల్లో నూతన భవనాల నిర్మాణాలు ప్రస్తుతం జరుగుతున్నాయి.

పాఠకులకు పోటీ పరీక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయా.?

ప్రతి గ్రంథాలయంలో పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వం ఏదైనా నోటిఫికేషన్ విడుదల చేసిన వెంటనే సంబంధిత కాంపిటేటీవ్ మెటీరియల్‌ను కొనుగోలు చేసి ఉంచుతున్నాం. వీటివల్ల అనేకమంది నిరుద్యోగులకు చాలా ఉపయోగం కలుగుతుంది.

గ్రంథాలయ వారోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

ఈ నెల 20వ తేదీ వరకూ నిర్వహించే 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలకు చెందిన గోడపత్రికలు, కరపత్రాలను ఆదివారం స్టేట్ హౌసింగు కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాల ఆవశ్యకతపై పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. సామర్లకోట శాఖ గ్రంథాలయ అధికారి బందిల రత్నామణి మట్లాడుతూ 14న బాలలచే స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలు, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ, 17న కవి సమ్మేళనం, 18న విద్యార్థుల పోటీల నిర్వహణ, 19న మహిళా దినోత్సవం, దిశ చట్టంపై అవగాహన, 20న సభలో డిజిటల్ గ్రంథాలయాలపై విద్యార్థులకు అవగాహన, విజేతలకు బహుమతి ప్రధానం ఉంటాయని వివరించారు. ఈ కార్యక్రమంలో సామర్లకోట మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్ మోజెస్, గంగిరెడ్డి కృష్ణమూర్తి, మాగాపు గోపి తదితరులున్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దొరబాబు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-ఏలేశ్వరం

ప్రత్తిపాడు మండలం శాంతి ఎయిడెడ్ పాఠశాలలో 1999-2000లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం నిర్వహించారు. 22 ఏళ్ల తర్వాత కలుసుకున్న సందర్భంగా స్కూల్లో చదివిన రోజుల్లోనూ పాత జ్ఞాపకాలు నెమరు వేసుకుని ఆటపాటలతో స్కూల్ ఆవరణలో సందడి నెలకొంది. అనంతరం శాంతి ఆశ్రమం స్కూల్ విద్యార్థులు యూనిఫారం నిమిత్తం రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమం వెలుగుల తాతబ్బాయి, బుడంకాయలు సురేష్, బర్ల లోవరాజు, కుళ్ల లోవేశ్వరరావు, కాకి రామకష్ణ, శీరందాసు వీర్రాఘవులు, కుమిలి శివ, గుబ్బల రామలక్ష్మణ్, మైలపల్లి చంటి, ఆంద్రూస్ లాలం అరుణ, మేడసాని దుర్గ, వక్కలంక పద్మ, సింహాద్రి దేవి, సారీకి నాగమణి, కోన భవాని, తదితరులు పాల్గొన్నారు.


పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

జనసేన ఆధ్వర్యంలో 'జగనన్న ఇళ్లు - పేదల కన్నీళ్లు'

ప్రజాశక్తి - సీతానగరం, పెరవలి

సీతానగరం, కోరుకొండ మండలాల్లో ఆదివారం జనసేన నాయకులు బత్తుల బలరామకృష్ణ, నా సేన నా వంతు ఉమ్మడి జిల్లాల కో-ఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో జగనన్న ఇళ్లు - పేదల కన్నీళ్ల కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత గాదరాడలో అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాదరాడ, సింగవరం జగనన్న కాలనీల లేఅవుట్లలో నిరసనలు తెలిపారు. సింగవరంలో బత్తుల తంపలుతు మాట్లాడారు. పేదలందరికీ ఇళ్లు అని చెప్పు కోవడం తప్ప ఏ ఒక్కరికి ఇళ్ల స్థలాలు కేటాయించలేదన్నారు. ఈ కార్యక్రమంలో మట్టా వెంకటేశ్వరరావు, మద్దాల యేసుపాదం, చీకట్ల వీర్రాజు, మద్దాల జీవన్, గళ్ళ రంగా, అడ్డాల శ్రీను, చిక్కిరెడ్డి దొరబాబు పాల్గొన్నారు. పెరవలి మండలం ఖండవల్లిలో 'జగనన్న ఇళ్లు - పేదలందరికీ కన్నీళ్లు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు తులా చినబాబు, ఉలుసు సౌజన్య, పిప్పర రవిమూర్తి పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో దుర్గాప్రసాద్ ప్రతిభ

ప్రజాశక్తి-కాకినాడ

మూడేళ్ల వయసులో స్కేటింగ్ పోటీల్లో పాల్గొంటూ బంగారు పతకాలను కైవసం చేసుకున్నాడు సత్తి శ్యాంసుందర్ రెడ్డి. ఆదివారం జరిగిన ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో స్థానిక అక్షర స్కూల్ రోడ్డులో జిల్లాస్థాయి స్కేటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అండర్ 11 విభాగం నుండి జగన్నాధపురం దుర్గాప్రసాద్ స్కూల్లో మూడో తరగతి చదువుతున్న సత్తి శ్యామ్ సుందర్ రెడ్డి పాల్గొన్నాడు. రింక్ 3 టైం ట్రైల్, రింక్4 -500 మీటర్లు, రోడ్ 2-1500 మీటర్ల మూడు విభాగంలో పాల్గొని విజేతగా నిలిచి మూడు బంగారు పతకాలను కైవసం చేసుకున్నాడు. ఈ సందర్భంగా దుర్గ ప్రసాద్ స్కూల్ డైరెక్టర్ ఎం సంతోష్, సిఇఒ భానుప్రియాంక మాట్లాడుతూ విద్యార్థులు అందరూ చదువుతోపాటు, క్రీడల్లోనూ రాణించి భారతదేశ ఉనికిని చాటాలన్నారు. ఈ సందర్భంగా విజేతను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ హెడ్ వి.శంకర్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధి కోసం కృషి చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం

విద్యార్థులు దేశ అభివృద్ధి కోసం కృషి చేయాలని రాష్ట్ర రెవెన్యూ ఉద్యోగుల సంఘం జెఎసి అధ్యక్షులు వివిఎస్.దివాకర్ పిలుపునిచ్చారు. ఆదివారం అమలాపురం మద్దాలవారిపేట ఎస్‌సి కళాశాల హాస్టల్ లో జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన పిడిఎస్‌యు రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దివాకర్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యను నిర్లక్ష్యం చేయకుండా శ్రద్ధగా చదివి ఉన్నత శిఖరాలు చేరుకోవాలన్నారు. పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు రేవు తిరుపతిరావు మాట్లాడుతూ ఈ నెల 25 ,26 ,27 తేదీలలో ఏలూరులో జరిగే 13వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారి ప్రవీణ్ కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

పిడిఎస్‌యు నూతన కమిటీ ఎన్నిక

రామచంద్రపురం పిడిఎస్ యు విద్యార్థి సంఘం డివిజన్ స్థాయి ఎన్నికలు నిర్వహించారు. డివిజన్ అధ్యక్షులుగా వై.త్రిష, ప్రధాన కార్యదర్శి కె. సందీప్ ఉపాధ్యక్షుడు నవీన్ కుమార్, సహాయకార్యదర్శిగా వై. అరుణ్. కోశాధికారిగా వై. ప్రియదర్శినితో పాటు 15 సభ్యులు తో రామచంద్రపురం డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారని జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సిద్దూ తెలిపారు. పట్టణంలో జరిగిన మహాసభకు సహకరించిన విద్యా సంస్థలు, సుఖీభవ ఛారిటబుల్ ట్రస్ట్, మీడియా, వివిధ సంస్థల వారికి విప్లవాభినందనాలు తెలిపారు

32 మద్యం సీసాలు స్వాధీనం

ప్రజాశక్తి - సీతానగరం

సీతానగరం మండలం చినకొండేపూడి ఆటో స్టాండ్ పక్కన ఒక పాన్ షాప్‌లో పోలీసులు దాడి చేసి 32 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. సీతానగరం ఎస్ఐ శుభ శేఖర్‌కు అందిన సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో బండారు అప్పాజీ నిర్వహిస్తున్న పాన్ షాప్‌లో అక్రమంగా అమ్మేందుకు ఉంచిన 32 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందుతుడిని కోర్టులో హాజరు పరిచామని తెలిపారు. నిందితునికి 14 రోజులు రిమాండ్ విధించారని ఎస్ఐ తెలిపారు.

జగనన్న ఇళ్ల స్థలాల పరిశీలన

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో వేర్వేరు చోట్ల జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు జగనన్న ఇళ్ల స్థలాలను ఆదివారం పరిశీలించారు. వివరాలు ఇవి..

కపిలేశ్వరపురం అంగర గ్రామం హైస్కూల్ సమీపంలో జగనన్న ఇళ్ల స్థలాలను ఆదివారం జనసేన నియోజకవర్గ ఇంచార్జ్ వేగుళ్ల లీలాకృష్ణ పరిశీలించారు. అంగరలో నిర్వహించిన జగనన్న ఇళ్ళు పేదలందరికీ కన్నీళ్ల కార్యక్రమంలో లీలా కృష్ణ, జిల్లా కార్యదర్శి కొమ్మిశెట్టి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. **ఉప్పలగుప్తం** జగనన్న కాలనీలలో పేదలకు తక్షణం ఇళ్ల నిర్మించి మౌలిక సదుపాయాలు కల్పించి వారికి స్వాధీనం చేయాలని జనసేన పార్టీ డిమాండ్ చేసింది. సరిపల్లి జగనన్న కాలనీలో ఆదివారం జనసేన పార్టీ నాయకులు డిఎంఆర్ శేఖర్ ఆధ్వర్యంలో జగనన్న ఇళ్లు పేదలందరికీ కన్నీళ్లు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఇసుకపట్ల రఘుబాబు ఆకుల సూర్యనారాయణ మూర్తి, అయితాబత్తుల ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ధనమ్మ మర్రికి పర్యాటకుల తాకిడి

ప్రజాశక్తి - కపిలేశ్వరపురం

కేదార్లంక శివారు వీధి వారి లంకలో ధనమ్మ మర్రికి ఆదివారం పర్యాటకులుపోటెత్తారు.కార్తిక మాసం కావడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి యాత్రికులు వచ్చి ధనమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. అంగర ఎస్ఐ సంపత్ కుమార్ బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కొత్తపేట

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందినట్లు కొత్తపేట అదనపు ఎస్ఐ డి.శశాంక తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని కొత్తపేట గ్రామ శివారు చిన్నగూళ్లపాలెంకు చెందిన సూరంపూడి నాగేశ్వరావు(66) ఆసుపత్రి నిమిత్తం ఆదివారం ఉదయం మోపెడ్ వాహనంపై ఇంటి నుంచి బయలుదేరాడు. మార్గమధ్యలో స్థానిక మారుతి సెంటర్ మన్నా చర్చవద్దకు వచ్చేసరికి రావులపాలెం వైపుగా అతి వేగంగా వెళ్తున్న లారీ ఢీకొంది. అతనికి బలమైన గాయాలు అవ్వడంతో వెంటనే స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందాడు.ఈ సంఘటన పై మృతిని కుమారుడు శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అదనపు ఎస్ఐ తెలిపారు.

నేడు కోర్టుకు శ్రీలంక జాలర్లు

ప్రజాశక్తి- కాకినాడ కార్పొరేషన్

అనుకోకుండా భారత జలాల్లోకి ప్రవేశించిన 11 మంది శ్రీలంకకు చెందిన మత్స్యకారులను సోమవారం కాకినాడ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు కాకినాడ మెరైన్ సిఐ సుమంత్ ఆదివారం తెలిపారు. భారత సముద్ర జలాల్లో వేటాడుతున్న మత్స్యకారులను శనివారం కోస్ట్ గార్డ్ సిబ్బంది అరెస్టు చేసి మెరైన్ పోలీసులకు అప్పగించడం తెలిసిందే.


మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న సత్యానందరావు తదితరులు

టిడిపి నేత రామకృష్ణ మృతి తీరని లోటు

ప్రజాశక్తి-రావులపాలెం

టిడిపి సీనియర్ నేత రావులపాలెం మాజీ ఎంపిటిసి సభ్యుడు వాసంశెట్టి రామకృష్ణ మృతి పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కొత్తపేట మాజీ ఎంఎల్ఎ బండారు సత్యానందరావు అన్నారు. గుండెపోటుతో రాజమహేంద్రవరం ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ రామకృష్ణ శనివారం రాత్రి మృతి చెందారు. రామకృష్ణ ఆత్మకు శాంతి కలగాలని, ఆయన కుటుంబ సభ్యులకు సత్యానందరావు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పార్టీ సీనియర్ నాయకుడు ఆకుల రామకష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, పార్టీ నాయకులు చప్పిడి వరప్రసాద్, మేడపాటి కాసురెడ్డి, పడాల బులికొండారెడ్డి, సిద్దిరెడ్డి శ్రీనివాస్ తదితరులు రామకృష్ణ మృతికి సంతాపం ప్రకటించారు.

నేటి నుంచి గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి -మండపేట

55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఏడిద రోడ్డులోని శాఖా గ్రంథాలయంలో ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తామని మండపేట గ్రంథాలయాధికారి ఎన్.బాల ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

నేరాలు ఘోరాలు

కోడి పందేలపై దాడి

ప్రజాశక్తి -ఏలేశ్వరం

మర్రివీడు శివారు పరిమితడక గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేలపై ఎస్ఐ సిహెచ్.విద్యాసాగర్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి నుంచి రెండు కోళ్ల రూ.900 నగదు స్వాధీనం చేసు కున్నారు.

అనంతరం ఏలేశ్వరం లో దెబ్బలు పాలెం లో పేకాట శిబిరంపై దాడి చేసి ఇద్దరు వ్యక్తులను రూ.1250 నగదును స్వాధీనం చేసుకొని వారిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ విద్యాసాగర్ తెలిపారు.

పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - సీతానగరం

సింగవరానికి చెందిన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలివి.. సింగవరానికి చెందిన దారా వీరబాబు తన భార్యతో కొంత కాలంగా ఘర్షణ పడుతున్నాడు. ఇటీవల జరిగిన వివాదంలో భార్యపై చేయి చేసుకున్నాడు. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. కాపురానికి రావాలని ఆమెకు ఫోన్ చేసి గొడవ పడ్డారు. ఆమె రానని తెగేసి చెప్పడంతో మనస్తాపానికి గురై శుక్రవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. అతన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన చికిత్స పొందుతున్నాడు. ఆసుపత్రి నుంచి సమాచారం అందుకున్న సీతానగరం పోలీసులు కేసు నమోదు చేశారు.

మహారాజశ్రీ 1వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం

M.V.O.P. No. 463/2021

Between:

Laxmi Santhosh (being minor rep. by his next friend and Natural guardian mother Lakshmi Naga Lakshmi, W/o. Durga Rao, Hindu, aged 35 years, R/o. Dr.No. 2-104, K.Jambupatnam, Korukonda Mandal, E.G.Dist., ***...Petitioner***

AND

R-1: K.Rambabu, S/o. Suryanarayana, Hindu, aged 50 years, R/o. Dr.No. 153, Vinayak Street, West Gonagudem, Korukonda Mandal, E.G.Dist., (within the jurisdiction of RJCJ) ***...1st Respondent***

పై నంబరు దావాలో 1వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 21-11-2022 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై దావాలో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేని యెడల సదరు దావాను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి **ఎన్.లక్ష్మణరావు**

13-11-2022 అడ్వకేట్, రాజమండ్రి

మహారాజశ్రీ కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. 268/2017

Between:

వాద్లు: 1. శ్రీమతి సింహాద్రి కల్యాణి
2. కుమారి సింహాద్రి సూర్యతేజ

ప్రతివాద్లు:
శ్రీమతి సింహాద్రి వరలక్ష్మి వగైరాలు

To:

2. మద్దిపాటి మంగరాజ నాగలక్ష్మి, W/o. వెంకట గణేష్, డోర్ నెం. 6-49, వుమాశంకర్ నగర్, 3వ సందు, కానూరు, తూ॥గో॥జిల్లా.

మీ వగైరాలపై వాద్లు కొవ్వూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు నందు పై దావా నెంబరున దావా షెడ్యూలు దాఖలా ఆస్తులు పార్టీషన్ నిమిత్తం దావా దాఖలు చేసి, సదరు దావా నందు I.A. 1465/2017 వ నెంబరున Temporary Injunction Petition దాఖలు చేసుకొని సదరు దావాలోను మరియు పిటీషనులోనూ మీకు కోర్టు ద్వారా మరియు రిజిస్టర్డ్ పోస్టు ద్వారా ఎన్నిసార్లు సమనులు మరియు నోటీసులు పంపించిననూ మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీ కోర్టు వారు Substitute Service ద్వారా నోటీసులు ఆర్డరు వేసి వున్నారు. కావునా పై నెంబరు దావాలోనూ మరియు I.A. 1465/17 వ నెంబరు గల Temporary Injunction Petition లోనూ ఏమైన అభ్యంతరములు వున్న ఎడల మీరు **ది. 18-11-2022వ తేదీ ఉదయం గం॥ 10.30 ని॥లకు** పై కోర్టు వారి ఎదుట హాజరై తెలియపరచుకొనవలెను. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

కె.ఎస్.రాఘవులు, అడ్వకేట్

కొవ్వూరు, సెల్: 9441116118

దావా సమను

మహారాజశ్రీ అనపర్తి జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S. No. 50/2021

Between:

పడాల వసంతకుమార్ రెడ్డి **-వాది**

AND

కర్రి సత్యన్నారాయణ **-ప్రతివాది**

To:

కర్రి సత్యన్నారాయణ, S/o. తాతబ్బాయి, 50 సం॥లు, జూనియర్ అసిస్టెంట్ కమ్ బిల్ కలెక్టర్, గ్రామ సచివాలయం, కూనవరం, కూనవరం మండలం, తూ॥గో॥జిల్లా, కూనవరం MRO కోర్టు. **-ప్రతివాది**

పై నెంబరు దావా గ్రంథమునకు సంబంధించి ప్రతివాది యొక్క అప్పియరెన్స్ నిమిత్తం **దివి. 24-11-2022 వాయిదాగా అయివున్నది. కాబట్టి ఆరోజు ఉదయం 10.30 ని॥లకు** మీరు శ్రీ కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, లేదా మీ అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై మీ సంజాయిషీ దాఖలు చేసుకోవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానించ బడునని తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వులను అనుసరించి)

ఎస్.సూర్యనారాయణరెడ్డి
కె.సత్యన్నారాయణరెడ్డి
అడ్వకేట్స్, అనపర్తి

In the Court of the 5th Addl. District Judge, Rajamahendravaram

I.A. No. 1492 of 2019

O.S. No. 61 of 2019

Between:

Dangeti Nagaratnam ***...Petitioner/ Plaintiff***

AND

Katta Mahendra and Others ***...Respondents/ Defendants***

Respondent Nos. 4 & 5:

4. Guthula Anantha Lakshmi, Wife of Venkataramana, Hindu, aged 55 years, House Wife, D.No. 4/82, Dosakayalapalli (V), Rajanagaram Mandal, E.G.Dt.

5. Gurajarapu Seethamma, Wife of Surayya, Hindu, aged 53 years, House Wife, D.No. 7/92, Angara (V), Kapileswarapuram Mandal, E.G.Dt.,

Whereas the above named petitioner filed the above suit and filed above I.A. against the respondents. The above case stands posted to **23-11-2022** for your appearance **at 10.30 A.M.** before the said court. Take notice that if you fail to appear before the said court on that day, the matter will be proceeded ex-parte in your absence.

S.KUMAR
Advocate, Rajahmundry
Cell: 9949570440

In the Court of the 5th Addl. District Judge, Rajamahendravaram

O.S. No. 61 of 2019

Between:

Dangeti Nagaratnam ***...Plaintiff***

AND

Katta Mahendra and Others ***...Defendants***

Defendant Nos. 4 & 5:

4. Guthula Anantha Lakshmi, Wife of Venkataramana, Hindu, aged 55 years, House Wife, D.No. 4/82, Dosakayalapalli (V), Rajanagaram Mandal, E.G.Dt.

5. Gurajarapu Seethamma, Wife of Surayya, Hindu, aged 53 years, House Wife, D.No. 7/92, Angara (V), Kapileswarapuram Mandal, E.G.Dt.,

Whereas the above named petitioner filed the suit against the defendants for declaration and injunction and other reliefs. The above case stands posted to **23-11-2022** for your appearance **at 10.30 A.M.** before the said court. Take notice that if you fail to appear before the said court on that day, the matter will be proceeded ex-parte in your absence.

S.KUMAR
Advocate, Rajahmundry
Cell: 9949570440